**సంపుటి-1, సంచిక-3**
15వ శాసనపరిషత్తు
**సమావేశము-XXXIX (39)**

**వెల : రూ. 17-00**
**22 నవంబర్, 2021**
**సోమవారం**
**(శక సంవత్సరము - 1943**
**కార్తీక ౩౦.- 3)**

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE COUNCIL DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

విషయసూచిక

| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | సంతాప తీర్మానం<br>CONDOLENCE MOTION | 1 - 8 |

## ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

## ప్రిసైడింగ్ అధికారులు

| | | |
|---|---|---|
| **చైర్మన్** | : | శ్రీ కొయ్యే మోషేను రాజు |
| **డెప్యూటి చైర్మన్** | : | ---- |
| **వైస్ చైర్మన్ల ప్యానల్** | : | శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద రావు |
| | | శ్రీ జంగా కృష్ణమూర్తి |
| | | శ్రీ అంగర రామమోహన్ |
| | | శ్రీమతి మయానా జకియా ఖానమ్ |

## శాసనమండలి అధికారులు

| | | |
|---|---|---|
| **కార్యదర్శి** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| | | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి ఆర్.వనితారాణి |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ డి. జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీమతి కె. భారతి |
| | | శ్రీమతి డి.విజయకుమారి |
| | | శ్రీమతి జి. భారతలక్ష్మి |
| | | శ్రీ ఆర్.శ్రీనివాసరావు |
| | | శ్రీమతి వై.వి.రజని |
| | | శ్రీ వి. విశ్వనాథం |
| | | శ్రీ ఎమ్. ఈశ్వరరావు |
| | | శ్రీమతి ఎన్.ఇందిరాకుమారి |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ బబ్బూరి వెంకటకృష్ణ |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

## సోమవారం, 22వ తేది, నవంబరు, 2021

* * * * *

**(సభ ఉదయం గం.10.06 ని.లకు సమావేశమైనది)**

**(మిస్టర్ చైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)**

* * *

**MR.CHAIRMAN:** Now, Let us take up Condolence Motion.

### 1. సభా కార్యక్రమం – సంతాప తీర్మానం (CONDOLENCE MOTION)

"That this House places on record its deep sense of sorrow at the demise of Smt. Mohammed Karimunnisa, Member of Andhra Pradesh Legislative Council and conveys its deep sense of sympathy to the members of bereaved family".

Now, Hon'ble Minister for Finance.

**శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్(SRI BUGGANA RAJENDRANATH):** అధ్యక్షా, ఈరోజు చాలా బాధగా ఉంది. దుఃఖంతో కూడిన రోజు. నిన్న కాక మొన్న మీరు ఈ గౌరవమైన స్థానాన్ని అలంకరించేటప్పుడే తోటి సభ్యురాలు శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు ఎంతో సంతోషంతో చాలా ఆనందంగా మన మధ్యలోనే ఉన్నారు ఆరోజున మీరు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించేటప్పుడు తను కూడా మీ మాదిరిగానే, మా మాదిరిగానే స్థానిక సంస్థల నుండి వచ్చినవారే. నేను కూడా రెండు పర్యాయాలు పనిచేసి ఇక్కడకు వచ్చాను. మీరు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించే రోజున స్థానికసంస్థలు పరిపాలనకు ఎంత ముఖ్యమో అనే విషయాన్ని కూడా నేను సభకు చెప్పాను. అదే విధంగా శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు విజయవాడ నగర కార్పొరేటర్‌గా తన రాజకీయ జీవితం మొదలుపెట్టి మైనారిటీ వర్గానికి చెందిన మహిళ అయినా కూడా ఎన్నో సేవా కార్యాక్రమాల్లో పాల్గొని మంచి పేరు తెచ్చుకుని అందరి మన్ననలు పొందారు. తనదైన శైలిలో సామాన్య మానవులందరికి కూడా సముచిత స్థానం ఇవ్వాలి, కష్టపడిన వాళ్లందరూ రాజకీయాల్లో, నమ్మకంతో ఉన్నవాళ్లందరూ రాజకీయాల్లో సముచిత స్థానాన్ని అలంకరించినట్లైతే తద్వారా ఇతరులకు కూడా నమ్మకం, భరోసా, ధైర్యం వస్తుంది, ఈరోజు రాజకీయాల్లో కేవలం ఆర్థికంగా ఉన్నతమైన స్థానంలో ఉండేవారే కాకుండా సామాన్య మానవులకు కూడా సమానమైన హక్కు ఉండాలి, అవకాశం ఉండాలనే భావనతో గౌరవ ముఖ్యమంత్రి గారు పరిపాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు కూడా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా వచ్చారు. అంటే గవర్నర్ గారి కోటా తరవాత ఎమ్మెల్యే కోటాలో ఎవరైతే ఎమ్మెల్సీలుగా వస్తారో అంత ఇంపార్టెన్స్ ఉన్నట్టుగా భావిస్తారని మీకూ తెలిసిన విషయమే. అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటుతో చనిపోవడం చాలా బాధాకరమనిపించింది.

వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతికల్పించాలని భగవంతుని ప్రార్థిస్తూ, "ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు సభ్యురాలు శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది". వారి కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండి, ఏ మార్గంలో తను నడిచిందో, అదే మార్గంలో ప్రజాసేవలో వాళ్లు కూడా పాలుపంచుకోవాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ వెల్లంపల్లి శ్రీనివాసరావు(SRI VELLAMPALLI SRINIVASA RAO):** అధ్యక్షా, నమస్కారం. మొన్న జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం. శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు విజయవాడలో చాలా చురుకుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. 2014 నుండి 2019 వరకు వారు కార్పొరేటర్‌గా పనిచేశారు. ఆ రోజుల్లో కూడా చాలా మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తెలుగుదేశంపార్టీలోకి మారినా కూడా నేను జగన్మోహన్ రెడ్డి గారికి తోడుగా ఉండాలని భావించి కష్టకాలంలో కూడా జగన్మోహన్ రెడ్డి గారికి శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు తోడుగా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి గారు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎమ్మెల్సీగా స్థానం కల్పించారు. కృష్ణా జిల్లాలో అటు మచిలీపట్నం నుండి ఇటు జగ్గయ్యపేట వరకు ప్రభుత్వపరంగా ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ప్రతి సందర్భంలో ఆమె పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమలను ప్రజలకు చేరవేసే క్రమంలో ముఖ్యభూమిక పోషించారు. జగన్మోహన్‌రెడ్డి గారు ప్రజా ఓదార్పు యాత్ర చేసిన కాలం నుంచి వారి కుటుంబంతో చక్కటి సంబంధాలున్నాయి. ఓదార్పుయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి గారు శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారి ఇంటికి వెళ్లి భోజనం చేశారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా జగన్మోహన్ రెడ్డి గారు శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా కుటుంబానికి పెద్దపీట వేయడం జరిగింది. అందుకు అనుగుణంగానే వారు కూడా అనేక సేవా కార్యక్రమాలో డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్కడ ఎవ్వరికీ ఏ సహాయం కావాలన్నా ముందుండేవారు. వారు అటు పార్టీకి పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి మైనారిటీలతో పాటు ఇతర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజానీకంతో మమేకమవుతూ ముందుకువెళ్లేవారు. దురదృష్టకర సంఘటన ఏమిటంటే, మొన్న చనిపోయేనాడు కూడా ఆమె చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా గౌరవ ముఖ్యమంత్రి గారితో ఫోటోలు దిగారు. ఆ సంఘటనను వారి నివాసంలోని ఇతర కుటుంబసభ్యులతో రాత్రి సమయంలో షేర్ చేసుకున్నారు. రాత్రిపూట కుటుంబసభ్యులతో భోజనంచేస్తూ ఇవాళ జగన్మోహన్ రెడ్డి గారు నాతో చక్కగా మాట్లాడారు, జగన్ బాబు గారితో ఫోటో దిగానని చెబుతూ సోషల్ మీడియాకు పంపించి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు భగవంతుడు మంచివాళ్లను తొందరగా తీసుకువెళ్తారనడానికి తార్కాణంగా భోజనానంతరం ఆమెకు ఆరోగ్యం బాగోలేదని హాస్పిటల్‌కు వెళ్లే మార్గమధ్యంలోనే ఆమె కన్నుమూశారని చెప్పడం చాలా బాధాకరం. ఏదిఏమైనా అటువంటి మంచి వ్యక్తులను మనం స్మరించుకోవాలి. అదే విధంగా వారి కుటుంబసభ్యులకు కూడా ప్రగాఢ సానుభూతి

తెలియపర్చడానికి గౌరవ ముఖ్యమంత్రి గారు వారి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అంతేకాకుండా కుటుంబసభ్యులకు ఎల్లప్పుడు పార్టీ, ప్రభుత్వం తోడు ఉంటుందని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఎందుకంటే శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారిది పెద్ద కుటుంబం. దాదాపు 34 మంది కుటుంబసభ్యులు ఒకే ఇంటిలో నివసిస్తుంటారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించేముందు కార్పొరేటర్‌గా ఆమె నామినేషన్ వేసిఉన్నారు. ఎందుకంటే మునిసిపల్ ఎన్నికలు కరోనా కారణంగా దాదాపుగా ఒక సంవత్సరంపాటు పోస్ట్‌పోన్ అయ్యాయి. ఆ కాలంలోనే ఆమెకు గౌరవ ముఖ్యమంత్రి గారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం, వెంటనే ఆమె కోడలికి కూడా డివిజన్‌లో కార్పొరేటర్‌గా బి ఫారం ఇచ్చారు. ఆమె కూడా అత్యధిక మెజార్టీతో కార్పొరేటర్‌గా ఎన్నికైనారు. వారు చేసిన కృషికి ఫలితంగా గౌరవ ముఖ్యమంత్రి గారు తప్పకుండా వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటారు, ప్రభుత్వం కూడా అండగా ఉంటుంది, తప్పకుండా వారి కుటుంబసభ్యులందరూ వారి తల్లిగారు వచ్చినట్టుగానే సేవా సంకల్పంతో వారు చూపించిన మార్గంలో పయనిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని కోరుకుంటూ వారి కుటుంబసభ్యులకు తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబం ధైర్యంగా ఉండాలని, మేమంతా వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కె.ఎస్.లక్ష్మణరావు(SRI K.S. LAKSHMANARAO) (పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారి ఆకస్మిక మృతికి పీడీఎఫ్ గ్రూప్ తరఫున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటిస్తున్నాం. శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు ఎమ్మెల్సీగా ఎన్నికైన తరవాత నేను కూడా కృష్ణా, గుంటూరు జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్సీని కాబట్టి అనేక సమావేశాల్లో పాల్గొనడం జరిగింది. ఆమె ఎమ్మెల్సీగా ఎన్నికైన తరవాత రెండు పర్యాయాలు జిల్లా సమీక్షా సమావేశాలు జరిగాయి. రెండు సమావేశాలకు వారు హాజరైనారు. మైనారిటీ వర్గాల గురించి ఆవిడ స్పష్టంగా అభిప్రాయాలను వెలిబుచ్చేవారు. అలాగే విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాలుగైదు హైస్కూల్స్ వారితోపాటు సందర్శించాను. ఆ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించాం. ప్రత్యేకించి ఆనాడు కృష్ణా జిల్లా జిల్లా కలెక్టర్‌గా ఇంతియాజ్ అహ్మద్ గారు రెండున్నర సంవత్సరాల పాటు పనిచేసేవారు. వారు బదిలీ అయిన సందర్భంగా జరిగిన వీడ్కోలు సమావేశంలో శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా గారు చక్కగా మాట్లాడారు. ఆ విధంగా కృష్ణా జిల్లాకు సంబంధించి ముఖ్యంగా విజయవాడ నగరానికి సంబంధించి గతంలో కార్పొరేటర్‌గా ఉన్నందున ఎమ్మెల్సీగా ఎన్నికైన తరవాత కూడా ఆమె అనేక అంశాలు ప్రస్తావించారు. ముఖ్యంగా మైనారిటీ విద్యార్థులు, మైనారిటీ వర్గాలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ఆమె సభలో ప్రస్తావించేవారు. ఇంత ఆకస్మికంగా ఆమె మరణించడం వారి కుటుంబానికి దురదృష్టకరం. ఆవిడ మృతికి మరొకసారి నా ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాను.

**ఉ.10:10**

**శ్రీ కత్తి నరసింహారెడ్డి(SRI KATTI NARASIMHA REDDY) (ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, మూడు రోజుల క్రితం మన మధ్యలో ఉండి శ్రీమతి కరీమున్నీసాగారి ఆకస్మిక మరణం తీవ్ర కలతను, దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఈ శాసనపరిషత్తులో ఎంతో చురుకుగా చలాకీగా ఉండే శాసనసభ్యులైన కర్నూలు జిల్లా అవుకుకు చెందిన శ్రీ చల్లా రామకృష్ణారెడ్డిగారి అకాల మరణం గురించి మనం మరువక ముందే కరీమున్నీసా గారు ఆకస్మికంగా మరణించడం చాలా ఆవేదన కలిగిస్తోంది. ఒక పేద మైనారిటీ వర్గం నుండి వచ్చిన మహిళా ప్రతినిధిగా ఈ శాసనపరిషత్తులో మహిళా సాధికారత లాంటి అంశాలమీద మీరు మాట్లాడాలి అని వారితో చర్చించడం జరిగింది. ముఖ్యమంత్రిగారు మన సభకు వచ్చినప్పుడు శ్రీమతి జకియా ఖానంగారు, కరీమున్నీసాగారు ముఖ్యమంత్రిగారితో ఫోటోలు తీసుకుని వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మనం కూడా ప్రత్యక్షంగా చూసి ఎంతో ఆనందపడడం జరిగింది. మన మధ్యలో ఉంటూ ఇంత ఆకస్మికంగా చనిపోవడం తీవ్రమైన బాధను, ఆవేదనను కలిగించింది. అలాగే మనుషులు శాశ్వతం కాదు, పదవులు శాశ్వతం కాదు. ఆ పదవీ కాలంలో వారు చేసిన సేవలు, మంచి పనులే కలకాలం గుర్తుండిపోతాయి. కరీమున్నీసాగారు కార్పోరేటర్‌గా, శాసనపరిషత్తు సభ్యులుగా సేవా కార్యక్రమాలలో వారిని గుర్తు పెట్టుకునేలాగా సేవలు చేశారు. కాబట్టి వారి అకాల మృతికి సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ జంగా కృష్ణమూర్తి(SRI JANGA KRISHNAMURTHY) (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, మహ్మద్ కరీమున్నీసాగారి మరణం చాలా బాధను కలిగించింది. ఆమె ఒక కార్పోరేటర్ స్థాయి నుండి ఎమ్మెల్సీ వరకు ఎదిగారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలవారికి, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి, మహిళా సాధికారత పెంచాలి, మహిళలు కూడా రాజకీయంగా ఎదగడానికి అండదండలు కల్పించాలనే ఉద్దేశంతో సీనియర్ నాయకురాలిగా, సమాజంపట్ల అంకితభావంతో అనేకమైన సేవా కార్యక్రమాలు చేసిన పెద్దలు శ్రీమతి కరీమున్నీసా గారికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. కరోనా సమయంలో కూడా వారి ప్రాంతంలో అనేక సేవలు అందించారు. వారి మరణం చాలా దిగ్భ్రాంతికి గురిచేసింది. వారి మరణానికి సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి(SRI YANDAPALLI SRINIVASULUREDDY) (పట్టభద్రుల నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, ఈరోజు చాలా బాధాకరమైన రోజు. నాలుగు నెలల క్రితం జగన్మోహన్‌రెడ్డిగారు ముస్లిం మహిళా మైనారిటీకి చెందిన కరీమున్నీసాగారిని ఎమ్మెల్యేల కోటా క్రింద ఎమ్మెల్సీగా ఎన్నిక చేసినందుకు చాలా సంతోషించాము. రాజధాని కేంద్రం నుండి వారు ఎన్నిక అయ్యారు. మొన్న కూడా చాలా సంతోషంగా కనిపించి మీరు

చైర్మన్‌గాఎన్నికైన రోజు సాయంత్రం హఠాన్మరణం చెందారని విని ఆ రాత్రి మేము నమ్మలేకపోయాము. సుదీర్ఘకాలంలో మంచి భవిష్యత్తు కలిగి విజయవాడ కార్పోరేటరుగా ఎన్నికై అనేక సమస్యల మీద స్వచ్ఛందంగా సర్వీసెస్ అందించినందున ఒక మంచి ప్రతిభా పాటవం కలిగిన చట్టసభ సభ్యురాలిగా ఎదుగుతారని ఆశాభావాన్ని వ్యక్తపరిచాము. వారి మరణం శాసనమండలినే కాక యావత్ ఆంధ్రప్రదేశ్‌ను శోకసంద్రంలో ముంచింది. ఈ సందర్భంగా మా ప్రగాఢమైన సానుభూతిని మీద్వారా వ్యక్తపరుస్తున్నాము.

**శ్రీ వాకాటి నారాయణరెడ్డి(SRI VAKATI NARAYANAREDDY) (స్థానిక సంస్థలు–నెల్లూరు):** అధ్యక్షా, ఈరోజు చాలా బాధాకరమైన దినం. ఎందుకంటే మీ ఎన్నిక సందర్భంగా సోదరి శ్రీమతి కరీమున్నీసాగారు చాలా యాక్టివ్‌గా తిరగడం జరిగింది. మామూలుగానే అందరితో సంప్రదించడం, ఏదైనా తెలియకపోతే అన్నా సభలో ఇది మాట్లాడవచ్చా అని తెలుసుకోవడంతోపాటు అన్ని విషయాలలో చలాకీగా తిరిగి అందరితో కలిసి మెలిసి పార్టీలకు అతీతంగా అన్ని విషయాలు చర్చించే మనస్తత్వం కలిగిన ఒక మైనారిటీ మహిళ. ఆవిడ ఉన్నట్లుండి చనిపోవడమనేది అందరికీ కూడా చాలా ఇబ్బందికరమైన విషయం. ఏది ఏమైనా పుట్టినవాడు గిట్టక తప్పదు అన్నట్లు వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం ఆ దేవుడు ప్రసాదించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ వెన్నపూస గోపాల్‌రెడ్డి(SRI VENNAPUSA GOPALREDDY) (పట్టభద్రుల నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, మహ్మద్ కరీమున్నీసాగారి మరణం తీవ్రంగా కలిచివేసింది. శుక్రవారం రోజున ముఖ్యమంత్రిగారు మన సభకు వచ్చినప్పుడు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా కన్పించారు. 35మంది కుటుంబ సభ్యులు గల ఒక పెద్ద కుటుంబం నుండి వచ్చారు. అటువంటి కుటుంబం నుండి వచ్చి ఒక తల్లిగా, చెల్లిగా, అక్కగా, పెద్దమ్మగా, వదినగా ఆమె ప్రవర్తన చాలా బాగుంటుంది. శుక్రవారం రోజు నాతో మాట్లాడుతూ, అన్న మీరు ఒకసారి మా ఇంటికి వచ్చి టీ తాగి వెళ్ళాలని చెబితే మేము సరే అన్నాము. కానీ అదే రోజు రాత్రి ఆమె మరణించడం చాలా దిగ్భ్రాంతికి గురి చేసింది. జగన్మోహన్‌రెడ్డిగారు 16 నెలల పాటు జైలులో ఉన్నప్పటికీ ఆమె వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమాలు అప్పగించినా ఆ కార్యక్రమాలను దిగ్విజయంగా అమలుచేస్తూ ముందుకు వెళుతూ కార్పోరేటర్‌గా మంచి విజయం సాధించింది. ఆమె మరణం వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని చెబుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసుకుంటూ, ఆ కుటుంబాన్ని స్ట్రెంగ్తెన్ చేయవలసిన బాధ్యత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారి మీద ఉన్నదని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్(SRI P.V.N.MADHAV) (పట్టభద్రుల నియోజకవర్గం–శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, ముందుగా అకాల మరణం చెందిన కరీమున్నీసా గారి ఆత్మకు

సద్గతులు ప్రాప్తించాలని ఖుదాను కోరుకుంటున్నాను. భారతీయ జనతా పార్టీ తరఫున వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని, అలాగే వారి మృతిపట్ల సానుభూతిని తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు అనేకరకాల నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అనేక వర్గాల వారికి ఎంపీ సీట్లు ఇవ్వడం, మరీ ముఖ్యంగా పెద్దల సభకు కూడా ఆ విధంగా ఎన్నుకోవడం జరిగింది. ఆవిధంగా ఎన్నుకున్నవారిలో ఒక మచ్చు తునక కరీమున్నీసాగారు. ఆమె ఎన్నిక కాబడిన తరవాత ఆమె ఎవరా అని చూస్తే ఆమె సభలో ప్రమాణస్వీకారం చేసి వచ్చిన తరవాత గత సమావేశాల కాలంలో పరిచయం చేసుకోవడం జరిగింది. అప్పుడు నిజంగానే ముఖ్యమంత్రిగారిని అభినందించాల్సిన పరిస్థితి. క్రిందిస్థాయి నుండి వచ్చే వ్యక్తులకు గుర్తించి వారికి సరైన గౌరవం కల్పించడం నిజంగా అభినందించదగ్గ విషయం. ఆవిధంగా ఆమెకు మంచి అవకాశం ఇవ్వడం జరిగింది. ఆమె బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తుందని చాలామంది చెప్పడం జరిగింది. శుక్రవారం రోజు ఆమెను కలిసి మాట్లాడడం జరిగింది. కానీ అదేరోజు ఆమె మరణించడం చాలా బాధాకరమైన విషయం. తప్పకుండా ఆ కుటుంబానికి దేవుడు అండగా ఉండాలని, అదేవిధంగా ఆమె ఆత్మకు సద్గతులు ప్రాప్తించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**ఉ.10:20**

**శ్రీమతి టి.కల్పలత(SMT.T.KALPALATHA) (ఉపాధ్యాయ నియోజకవర్గం-కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, నమస్కారం. కరీమున్నీసా గారి మరణం చాలా బాధాకరం. ఆమె మంచితనం, ఆమె చేసిన సేవా కార్యక్రమాల వలన ఆవిడ కార్పోరేటర్ స్థాయి నుండి శాసనపరిషత్తు సభ్యురాలిగా వచ్చారు. ఆవిడ ఈరోజు మన మధ్య లేరనే విషయం చాలా బాధాగా ఉంది. నేను కృష్ణా, గుంటూరు జిల్లా ఎమ్మెల్సీగా ఉన్నాను కాబట్టి, కరీమున్నీసాగారితో కృష్ణా జిల్లాలో అనేక కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. మేము వెళ్లిన ప్రతి కార్యక్రమంలో ఆమె మంచితనం మాకు అర్థమైంది. అన్ని చోట్లా ఆవిడ ఇంట్లో వారితో ఏవిధంగా అభిమానంగా ఉంటారో నాతో కూడా అదేవిధంగా ఎంతో అభిమానంగా ఉండి దగ్గరకు తీసుకునేవారు. ఆవిడ నాకు తల్లిలాగే కనిపించేవారు కాబట్టి ఆవిడ మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ** షేక్ **మహ్మద్ ఇక్బాల్(SRI SHAIK MOHAMMED IQBAL) (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, ధన్యవాదాలు. దురదృష్టవశాత్తు కరీమున్నీసాగారు మరణించారు. నేను ఆరోజు అక్కా మీరు డల్‌గా ఉన్నారేంటని అడిగితే, నాకు ఆరోగ్యం బాగాలేదు, నిన్న కూడా నేను కాసేపు ఉండి వెళ్లిపోయానని, ఈరోజు అధ్యక్షుల వారి ఎన్నిక ఉంది కాబట్టి వచ్చానని అన్నారు. కరీమున్నీసా అక్కగారు, నేను ఒకేసారి నామినేషన్ వేసి ఒకేసారి ఈ సభలోకి వచ్చాము. ఆమె ఎంతో ఆప్యాయత గలవారు. మొన్న బద్వేలులో జరిగిన ఎన్నికలలో కూడా జగనన్నకు, మా పార్టీకి సైనికురాలిగా ఎంతో ఆదరాభిమానాలు చూపించారు. పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా, బద్వేలు ఉపఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థి

గెలవాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. అన్ని పాదయాత్రల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగారు ఆమె సేవల్ని గుర్తించి మహిళల పట్ల ఉన్న గౌరవంతో ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. మాకందరికీ ఏవిధంగా గుర్తింపు ఇచ్చారో వారి సేవలకూ అదే గుర్తింపు ఇచ్చారు. ఏదేమైనా ఆవిడ మరణం మమ్మల్ని షాక్‌కు గురిచేసింది. అదే రోజు ఆవిడ ముఖ్యమంత్రిగారితో ఆఖరి ఫోటో దిగారు.

అధ్యక్షా, మీ ఎన్నికకు వచ్చి తమర్ని కూడా అభినందించారు. అదే రోజు రాత్రి మేము ఆ వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాము. వారి కుటుంబానికి ముఖ్యమంత్రిగారు, మా పార్టీ అండగా ఉంటుంది. మేమంతా వారికి తోడుగా ఉంటాము. ఆవిడ మంచి మనసున్న వ్యక్తి. దేవుడు వారికి అన్ని విధాలుగా సద్గతి ఇవ్వాలని అల్లాను ప్రార్థిస్తూ, ఆవిడ మరణానికి తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాదరావు(SRI DOKKA MANIKYA VARAPRASADARAO) (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, గౌరవ సభ్యులు కరీమున్నీసాగారి మరణం చాలా విషాదకరమైనది. ఆవిడ చిన్న కుటుంబం నుండి వచ్చి రాష్ట్ర శాసనపరిషత్తు సభ్యులుగా రావడం చిన్న విషయం కాదు. ఆవిడ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ప్రజాజీవనానికి ఎంతో శ్రమ చేసి ఉండడంవలనే ఇంత దూరం వచ్చారు. అంత ఎదిగిన తరవాత అకాలమరణం అనేది నిజంగా దుర్వార్త. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అంత ఎదిగిన సామాన్య మహిళ చిన్న కుటుంబాలకు చెందిన వారు కూడా ఈ స్థానానికి రావచ్చని ఒక సందేశం ఇచ్చారు. ఆవిడకు నివాళులు అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ చైర్మన్(MR.CHAIRMAN):** గౌరవ శాసనమండలి సభ్యురాలు కరీమున్నీసా బేగంగారి మరణం చాలా బాధగా ఉంది. నేను ఈ సభకు చైర్మన్‌గా వచ్చిన తరవాత ఇలా సంతాప తీర్మానం ప్రవేశపెట్టవలసి వస్తుందని కలలో కూడా ఊహించని సంఘటన. ఆరోజు నేను చైర్మగా ఎన్నికైనప్పుడు చివరిగా ఆ తల్లి నాదగ్గరకు వచ్చి బాబూ నీవు నాకు కొడుకులాంటి వాడివి, నీవు మంచివాడివని అందరూ చెబుతున్నారు, నీవు నిండు నూరేళ్లు ఆయుష్షు కలిగి ఉండాలని, మంచి పేరు తెచ్చుకోవాలని దీవించడం నేను జీవితంలో మరచిపోలేను. ఉదయం లేవగానే ఈ దురదృష్టకర సంఘటన చూసినప్పుడు రాత్రి నన్ను నా తల్లి దీవించింది. ఉదయానికి నేను నా తల్లిని కోల్పాయానని కలత చెంది వెంటనే వారి ఇంటి గుమ్మంలోకి వెళ్లగానే వారి కుటుంబసభ్యులు ఎదురొచ్చి బాబూ రాత్రి మా అమ్మ మీ గురించే మాట్లాడిందని, మీ గురించే అందరికీ చెప్పిందని చెప్పారు. ఆవిడ మరణించడం శాసనపరిషత్తు సభ్యులుగా కాకుండా సొంత తల్లిని కోల్పోయినట్లుగా నేను భావిస్తున్నాను. ఇటువంటి దురదృష్టకర సంఘటన మన పదవీకాలంలో ఎవరికీ రాకూడదని నేను ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను.

అతి సామాన్య కుంటుంబానికి చెందిన మైనారిటీ మహిళను జగన్మోహన్‌రెడ్డిగారు ఎంతో బాధ్యతగా సమాజం పట్ల మైనారిటీల పట్ల ఆయనకున్న భావనను వ్యక్తపరుస్తూ ఎటువంటి మద్దతు లేని మైనారిటీలు ఇటువంటి పెద్దల సభకు తీసుకురావడం, చిన్న తరగతికి చెందిన కులాల వారికి

ప్రాతినిధ్యం ఇవ్వాలని వారి వాణిని సభలో వినిపించడానికి అవకాశం కల్పించారు. జగన్మోహన్‌రెడ్డిగారు హర్షించినా, దేవుడు ఆవిడను దగ్గరకు తీసుకున్నారని భావిస్తున్నాను. శుక్రవారం ముస్లింలకు చాలా పవిత్రమైన రోజు. అదే రోజు ఆవిడ మరణించడం అంటే అల్లా దగ్గరకు తీసుకున్నారనే భావిస్తున్నాను. ఆవిడ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి సభ తరఫున, నా తరఫున, నా కుటుంబం తరఫున ప్రగాడ సానుభూతిని తెలియజేసుకుంటూ మన ప్రభుత్వం, ఈ సభ, వారి కుటుంబానికి, మైనారిటీలకు అండగా ఉంటుందని తెలియజేసుకుంటున్నాను.

శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా 1956వ సంవత్సరం జూన్ 6వ తేదీన శ్రీ షేక్ రసూల్, శ్రీమతి షేక్ మిలినబీ దంపతులకు కృష్ణా జిల్లా, విజయవాడలో జన్మించారు. క్రియాశీల రాజకీయాలలో శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా చురుకుగా పాల్గొనేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పటి నుండి ఆ పార్టీలో పనిచేస్తున్నారు. గతంలో వారు విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్ 56వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేశారు. విజయవాడ నగరాభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ మైనారిటీ సంక్షేమం కొరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు.

శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా 2021వ సంవత్సరం మార్చి 30వ తేదీన శాసనసభ్యుల కోటాలో శాసనపరిషత్ సభ్యురాలిగా ఎన్నికైనారు. సేవామూర్తిగా పేరుగాంచిన శ్రీమతి మహ్మద్ కరీమున్నీసా 2021వ సంవత్సరం నవంబర్ 19వ తేదీన మరణించారు.

శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

(శ్రీమతి కరీమున్నీసాగారి ఆత్మకు శాంతి చేకూరాలని సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది)

**మిస్టర్ చైర్మన్(MR.CHAIRMAN):** తేది.23.11.2021, మంగళవారం ఉదయం గం.10.00లకు తిరిగి సమావేశమగుటకు సభను వాయిదా వేయడమైనది.

(The House then adjourned at 10.30 A.M. to meet again at 10.00 A.M. on Tuesday, the 23rd November, 2021)

**“Published under Rule 313 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**